క్లుప్తంగా

పార్టీ కోసం కష్టపడ్డా.. అవకాశం ఇవ్వండి



దీపాదాస్‌తో మాట్లాడుతున్న సీతారాములు

సుజాతనగర్: 35 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం తమ కుటుంబం పనిచేస్తోందని నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీని కలిసి మాట్లాడి వినతిపత్రం అందజేశారు. 2018తో పాటు తాజా అసెంబ్లీ ఎన్నికల్లో తనకు కొత్తగూడెం ఎమ్మెల్యే టికెట్ దక్కాల్సి ఉన్నా రాజకీయ సమీకరణాల వలన చేజారిందని తెలిపారు. పొత్తులో భాగంగా టికెట్ సీపీఐకి కేటాయించగా అభ్యర్థి గెలుపునకు కృషి చేసినట్లు చెప్పారు. దీంతో రాబోయే రోజుల్లో సముచిత స్థానం కల్పిస్తామని దీపాదాస్ హామీ ఇచ్చారని సీతారాములు తెలిపారు.

నామినేటెడ్ పదవి ఇవ్వండి..



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం ఇస్తున్న గెర్షోము

కొత్తగూడెంరూరల్/కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా పనిచేసిన ప్రజా యుద్ధనౌక గద్దరన్న కుమార్తె వెన్నెలకు నామినేటెడ్ పదవి కేటాయించాలని గాంధీపథం చారిటీ సర్వీసెస్ వ్యవస్థాపకుడు సీహెచ్.గెర్షోము కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల రాహుల్‌గాంధీ నిర్వహించిన ప్రాదయాత్ర లోనూ వెన్నెల పాల్గొన్నారని గుర్తు చేశారు.

రైల్వే సీడబ్ల్యూసీ మెంబర్‌గా జేమ్స్‌పాల్

కొత్తగూడెంఅర్బన్: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్‌గా జేమ్స్‌పాల్ ఎన్నికయ్యారు. 17వ తేదీ నుంచి శుక్రవారం వరకు సికింద్రాబాద్‌లో యాన్యువల్ జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. జేమ్స్‌పాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నర్సరీ పనులు పకడ్బందీగా చేపట్టాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలరాజు

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీలలో నర్సరీల ఏర్పాటు పనులు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ బాలరాజు సూచించారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామపంచాయతీ నర్సరీ ఏర్పాటు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. నిర్దేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగా ప్రజలకు ఉపయోగపడేలా గుర్తించిన మొక్కలను నర్సరీలలో పెంచాలని సూచించారు. గతంలో పెంచిన మొక్కల కంటే కొత్తవాటిని పెంచేలా విత్తనాలను ఎంపిక చేసుకోవాలని చెప్పారు. సర్పంచ్ సూర్నపాక రామయ్య, ఉపసర్పంచ్ రాంబాబు, ఎంపీవో చిరంజీవి, కార్యదర్శి మౌనిక పాల్గొన్నారు.

టీఏడీయూ కోకన్వీనర్‌గా కృష్ణ



సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) జిల్లా కోకన్వీనర్‌గా మర్రి కృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు గుడిమళ్ల రవికుమార్ శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ... జిల్లాలో యూనియన్ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా యూనియన్ పనిచేస్తుందన్నారు. తనపై నమ్మకంతో కోకన్వీనర్‌గా ఎంపిక చేసినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

23న ఎస్ఎఫ్ఐ మహాసభ

సింగరేణి(కొత్తగూడెం): 23న ఎస్ఎఫ్ఐ కొత్తగూడెం టౌన్ మహాసభను జయప్రదం చేయాలని కొత్తగూడెం ఎస్ఎఫ్ఐ టౌన్ అధ్యక్ష, కార్యదర్శులు రామ్ చరణ్, నాగకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తగూడెంలోని ప్రజాసంఘాల జిల్లా కార్యాలయం మంచికంటి భవన్‌లో వారు మాట్లాడారు. పులిపాటి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో మహాసభ జరుగుతుందని, ఈ సమావేశంలో విద్యారంగ సమస్యల పరిష్కారానికై కార్యాచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. సాగర్, శిరీష పాల్గొన్నారు.

బియ్యం ధరలకు రెక్కలు..!

- రెండు నెలలుగా ధరలు పైపైకి
- క్వింటాకు రూ.900 పెరిగిన వైనం
- సామాన్య ప్రజలపై పెనుభారం



చుంచుపల్లిలోని షాప్‌లో బియ్యం బస్తాలు

చుంచుపల్లి: ఇటీవల కాలంలో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. సామాన్యులను సన్న బియ్యం ధరలు హడలెత్తిస్తున్నాయి. భారీగా పెరిగిన ధరలతో వాటిని కొనాలంటే జంకే పరిస్థితులు నెలకొన్నాయి. గడిచిన రెండు నెలలుగా బియ్యం ధరలు అమాంతం పైపైకి ఎగబాకుతున్నాయి. సామాన్య, మధ్య తరగతి కుంటుంబాలు ఎక్కువగా బీపీటీ, సోనా మసూరి బియ్యం కొంటారు. ఇటీవల కొత్త, పాత రకం బియ్యం ధరలు 20 శాతం వరకు పెరిగాయి. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక భారం తప్పడం లేదు. మొదటి రకం సాంబ మసూరి బియ్యం ధర ఇటీవల కాలంలో క్వింటాకు ఏకంగా రూ.800 నుంచి రూ.900 వరకు పెరిగింది. మూడు, నాలుగు నెలల క్రితం వరకు సన్న బియ్యం క్వింటా రూ.3,700 నుంచి రూ.3,800 వరకూ ధర ఉండగా.. ప్రస్తుతం మార్కెట్‌లో బియ్యం ధర క్వింటా రూ.4,800 చేరింది. ఈ సన్న బియ్యంలో మొదటి రకం, రెండో రకమని వేర్వేరుగా వ్యాపారులు విక్రయిస్తుంటారు. రీటైల్ మార్కెట్‌లో మొన్నటి వరకు బియ్యం కిలో రూ.48 ఉండే వాటిని నేడు కిలో బియ్యం రూ.52 నుంచి రూ.55 వరకు అమ్ముతున్నారు. రాబోయే రోజుల్లో వీటి ధర మరింతగా పెరగనుందని వ్యాపారులు అంటున్నారు. మార్కెట్‌లో బియ్యం ధరల పెరుగుదలకు అకాల వర్షాలు, తుఫాన్ ప్రభావం వల్ల పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గడమేనని వ్యాపారులు చెబుతున్నారు. రైతులు కూడా సన్నాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా దొడ్డు రకాల వరిని సాగు చేయడం ఇంకో కారణమంటున్నారు. ఈ ధరల పెరుగుదలను ఆసరాగా చేసుకొని కొందరు బియ్యం వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి ధరలను ఇంకాస్త పెంచి అమ్మకాలు చేస్తుండటంతో సామాన్యులు బియ్యం కొనలేని పరిస్థితులు నెలకొన్నాయి. బియ్యం ధరల పెరుగుదలతో వ్యాపారం తగ్గిందని యజమానులు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బియ్యం ధరలు పెరుగుదల ఒకింత ఆందోళన కలిగిస్తోందని, ముందుగా వడ్డీకి తెచ్చి పెట్టుబడి పెట్టి వ్యాపారాలు చేయడం వల్ల అసలు వస్తాయో లేదో తెలియని పరిస్థితులు నెలకొన్నాయంటున్నారు. ప్రస్తుతం రోజంతా పనిచేస్తే రూ.250 గిట్టుబాటు కావడం లేదు. బియ్యం దగ్గర నుంచి ఉల్లితో పాటుగా, అన్ని నిత్యావసర వస్తువులు, పప్పులు, కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెరిగిన బియ్యం, పప్పుల ధరలను నియంత్రించకపోతే పేద, మధ్య తరగతి ప్రజలపై మరింత ఆర్థిక భారం పడనుందని పలువురు వాపోతున్నారు.

ధరలను నియంత్రించాలి..



పెరిగిన బియ్యం ధరలతో సామాన్యులు బతకడం ఇక కష్టంగా ఉంది. నెలంతా కష్టపడితే వచ్చేది అంతంత మాత్రమే. ఇటీవల కాలంలో కూరగాయల ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. ఇప్పుడు బియ్యం ధర పెరిగి ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ఏం కొనాలన్నా ధరలు మండిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి బియ్యం ధరలను నియంత్రించాలి.

– హరికుమార్, చుంచుపల్లి

వ్యాపారం తగ్గిపోయింది



గడిచి మూడు నెలలుగా బియ్యం ధరలు అమాంతం పెరుగుతూ వస్తున్నాయి. ఇటీవల కాలంలో ఏకంగా క్వింటాకు రూ.900 వరకు పెరిగింది. గడిచిన నెల రోజులగా బియ్యం కొనుగోళ్లు తగ్గాయి. ప్రస్తుతం వ్యాపారాలు అంతంత మాత్రంగా ఉన్నాయి. అప్పు తెచ్చి బియ్యం వ్యాపారం చేస్తున్నాం. స్టాక్ అలాగే ఉంటోంది. ఏం చేయాలో తెలియడం లేదు.

– తవిడిశెట్టి విజయ్, బియ్యం వ్యాపారి

ఎమ్మెల్యేకు సన్మానం



వినతిపత్రం అందజేస్తున్న ఉద్యమకారులు

ఇల్లెందు: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను తెలంగాణ ఉద్యమకారులను ఘనంగా సత్కరించారు. శుక్రవారం జేకే క్యాంపు కార్యాలయంలో కనకయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. అనంతరం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పులిగళ్ల మాధవరావు, ఆదూరి రవి, అజ్మీర భావ్‌సింగ్ నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులకు మేలు జరిగేలా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చారని, ఇల్లెందులో తెలంగాణ ఉద్యమానికి అత్యంత ప్రాధాన్యం ఉన్నందున అర్హులైన ఉద్యమకారులందరికీ న్యాయం జరిగేలా మీ సహాయ సహకారాలు ఉండాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేకల శ్యామ్, పడిదల నవీన్, ఎర్రబెల్లి కృష్ణయ్య, సిద్ధయ్య, జగదీష్, ఖాజా, ముత్యాల శ్రీనివాస్, కాసాని హరిప్రసాద్ యాదవ్, మునుగూరు రమేష్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

దోబీఘాట్ స్థలం ఆక్రమణకు యత్నం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఇల్లెందు: 18వ వార్డులో నిర్మిస్తున్న దోబీఘాట్ స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని పట్టణ రజక సంఘం నాయకులు ఆరోపించారు. ఈ విషయమై శుక్రవారం ఇల్లెందు తహసీల్దార్ రవికుమార్, మున్సిపల్ అధికారి అవినాష్‌కు వినతిపత్రాలు అందజేశారు. సదరు స్థలం తమదేనని కళాసీ బస్తీకి చెందిన వెంకన్న, మణెమ్మ ఆక్రమించే యత్నం చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కోరారు. దుంపటి కృష్ణ, కాసర్ల శ్రీనివాస్, సీహెచ్.మల్లయ్య, మండవరాజు, రావుల మల్లయ్య, గిరి, సత్యనారాయణ, ఎర్ర రమేష్, ముత్యాల లక్ష్మణ్, రాజు, భాస్కర్, శ్రీను పాల్గొన్నారు.

బ్లాక్‌మెయిల్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు

పాల్వంచ: జిల్లా వైద్యాధికారి జాస్తి వెంకటలక్ష్మీ శిరీషపై బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై పాల్వంచ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బి.రాము తెలిపిన వివరాలు.. వెంకటలక్ష్మీ శిరీషను సీతంపేట బంజరకు చెందిన గుగులోతు రాజేశ్ నాయక్ నాలుగు నెలల క్రితం కలెక్టరేట్ వద్ద కలిసి తనతో వచ్చిన ఇద్దరికి ఉద్యోగాలు ఇప్పించాలని కోరాడు. దీనికి శిరీష నిరాకరించారు. ఈ విషయాన్ని అప్పటి నుంచి మనసులో పెట్టుకుని మానసిక వేధింపులకు పాల్పడుతున్నాడు. విధులను సక్రమంగా చేసుకోనీయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. తనపై ఎస్సీ, ఎస్టీ కేసులు పెడతానని బెదిరిస్తున్నాడు. సోషల్ మీడియాలో తన అధికారం గురించి చెడుగా ప్రచారం చేస్తున్నాడు. దీంతో శిరీష రాజేశ్ నాయక్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతనిపై విచారణ చేసి న్యాయం చేయాలని ఆమె కోరారు. దీంతో ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇందిరాగాంధీ విగ్రహం అక్కడే ఏర్పాటు చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పాల్వంచ: దమ్మపేట సెంటర్‌లో రోడ్డు వెడల్పులో భాగంగా తొలగించిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించేలా చర్యలు తీసుకోవాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామికి వినతిపత్రం అందించారు. అనంతరం కొత్వాల మాట్లాడుతూ.. గతంలో ప్రభుత్వం పట్టణ ప్రగతిలో భాగంగా దమ్మపేట సెంటర్‌లో రోడ్డు వెడల్పు పనులు చేశారని, ఇందులో భాగంగా ఇందిరాగాంధీ విగ్రహాన్ని తొలగించినట్లు చెప్పారు. తిరిగి అక్కడే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో యర్రంశెట్టి ముత్తయ్య, కొండెం వెంకన్న, బద్ది కిశోర్, చాంద్ పాషా, కందుకూరి రాము, సూర్యకిరణ్, చెన్నూరి రాము, పులి సత్యనారాయణ, భాస్కర్, మధు, ప్రవీణ్, వీరకుమార్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటుకు దరఖాస్తు చేసుకోండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శారద

జూలూరుపాడు: పట్టభద్రుల ఓటరు నమోదుకు ఫిబ్రవరి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శారద అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల ఓటు నమోదు కోసం ఓటు ఎపిక్ నంబర్ ఉండాలన్నారు. అర్హులైన పట్టభద్రులు ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 1, 2020 నాటికి డిగ్రీ పూర్తయిన పట్టభద్రులందరూ ఓటు హక్కు నమోదుకు అర్హులన్నారు. పట్టభద్రులు తమ దరఖాస్తులను తహసీల్‌లో అందజేయవచ్చన్నారు. డిగ్రీ మెమో ఒరిజినల్, ఓటర్ ఐడీ కార్డు, పాస్ ఫోటో, ఆధార్ కార్డుతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సుజాతనగర్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయా శాఖల అధికారులు ప్రజలను కోరారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో కేంద్ర పభుత్వం అమలు చేస్తున్న ఆయా పథకాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిచడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ, విశ్వకర్మ యోజన, జన్‌ధన్ యోజన, పీఎం కిసాన్ తదితర పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అర్హులైన ప్రభుత్వ పథకాల లబ్ధిదారులందరినీ గుర్తించేలా చూడటమే ఈ యాత్ర ఉద్దేశ్యమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సీకా కృష్ణవేణి, వైద్యులు డాక్టర్ రమేష్, పంచాయతీ కార్యదర్శి బి.నరేంద్రప్రసాద్, బ్యాంకర్లు పాల్గొన్నారు.

చలికోట్లు పంపిణీ



చలికోట్లు అందజేస్తున్న ఉపాధ్యాయులు

టేకులపల్లి: భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఉన్నత ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు చలి నుంచి ఉపశమనం లభించింది. ఐటీడీఏ పీఓ ఆదేశాల మేరకు గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలకు చలి కోట్లు (స్వెట్టర్లు) సరఫరా చేశారు. దీంతో శుక్రవారం గంగారంలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు స్వెట్టర్లను అందజేశారు. హైస్కూల్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పి.నర్సయ్య, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పెండెకట్ల రామనాథం, వ్యాయామ ఉపాధ్యాయుడు బుగ్గ వెంకటేశ్వర్లు, వార్డెన్ దొడ్డ అంజయ్య, వెంకటేశ్వర్లు, మాలోతు బాలు నాయక్, సీతారామయ్య, బాలాజీ, బిచ్చా, స్వామి, హరిదాసు పాల్గొన్నారు.

327 యూనియన్‌లో చేరిక

పాల్వంచ: టీఆర్‌వీకేఎస్ యూనియన్‌కు చెందిన పలువురు నేతలు తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (327)లో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపంలో రాష్ట్ర అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నూతన సంవత్సర డైరీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాధం రామకృష్ణ ఆధ్వర్యంలో టీఆర్‌వీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ డోలి శ్రీనివాస్, జెన్‌కో వైస్ ప్రెసిడెంట్ మేదర రమేశ్, రీజనల్ సెక్రటరీ లింగయ్య తదితరులు యూనియన్‌లో చేరగా సంజీవరెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెన్‌కో ప్రెసిడెంట్ పి.మాధవరావు, జాలే కరుణాకర్ పాల్గొన్నారు.

రామాలయంలో పారిశుద్ధ్య పనులు

ఇల్లెందు: ఈ నెల 22న అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశవ్యాప్తంగా రామాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించాలని ఇప్పటికే ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. ఈ క్రమంలో రామాలయాలను పరిశుభ్రం చేసి ప్రత్యేక పూజలకు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా పట్టణంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గల రామాలయంలో శుక్రవారం స్థానిక కౌన్సిలర్ పత్తి స్వప్న స్వయంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు.

వార్షిక పరీక్షలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సుధీర్

జూలూరుపాడు: మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదోతరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై శుక్రవారం అవగాహన కల్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి సహకారంతో ట్రైనర్లు యాటా సురేంద్ర, తాటిపల్లి సుధీర్‌లు విద్యార్థులకు పదోతరగతి వార్షిక పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సరైన ప్రణాళిక, పట్టుదల, క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. తనలో ఉన్న భయాన్ని వీడి, ఆత్మవిశ్వాసం, స్వీయ అవగాహన, టీమ్ వర్క్ (కలిసి పని చేయడం), కమ్యూనికేషన్ స్కిల్స్‌పై వివరించారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్స్ బానోత్ నవీన్ రాథోడ్, అరెగల నరసింహారావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

11మెన్ కమిటీ సభ్యుడిగా శేషయ్య



సింగరేణి(కొత్తగూడెం): ఏఐటీయూసీ సెంట్రల్ కార్మికవర్గ 11మెన్ కమిటీ సభ్యులుగా ఏఐటీయూసీ, సీపీఐ నాయకుడు దమ్మాలపాటి శేషయ్యను ఆ యూనియన్ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం గోదావరి ఖనిలో జరిగిన యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయనను యూనియన్ నాయకులు ప్రకటించారు. శేషయ్య సింగరేణి సంస్థలో 1963లో విధుల్లో చేరి 2003లో ఉద్యోగ విరమణ చేశారు. 1983లో ఏఐటీయూసీ సభ్యులుగా యూనియన్‌లో చేరి సుమారు 50 ఏళ్లకు పైగా క్రియాశీలక పాత్ర పోషించారు. ఇప్పటికి మూడుసార్లు యూనియన్‌లో 11 మెన్ కమిటీ సభ్యులుగా చేసిన సేవలను గుర్తించి యూనియన్ నాయకులు ఆయనను మరోమారు 11 మెన్ కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు.

పనులు వేగవంతం చేస్తాం..



మొండితోగులో నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ చిరంజీవి

సాక్షి ఎఫెక్ట్..

ఇల్లెందురూరల్: గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు వేగవంతంగా సాగేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ బాలరాజు అన్నారు. 'నత్తనడకన జీపీ భవన నిర్మాణాలు' అనే శీర్షికతో శుక్రవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ స్పందించారు. మండలంలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎంపీఓ చిరంజీవి, ఆయా పంచాయతీ కార్యదర్శులతో భవన నిర్మాణ స్థితిగతులను తనిఖీ చేసి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా కాంట్రాక్టర్లపై ఒత్తిడి తేవాలని సూచించారు. సంబంధిత ఇంజినీర్లతో మాట్లాడి సకాలంలో నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

నర్సరీ పనులు త్వరగా పూర్తి చేయండి



నర్సరీలో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీఓ సత్యనారాయణ

చుంచుపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన హరిత నర్సరీల్లో చేపడుతున్న పనులను శుక్రవారం ఎంపీడీఓ మందా మంగమ్మ, ఎంపీఓ గుంటి సత్యనారాయణ పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి బ్యాగ్ ఫిల్లింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికల్లా విత్తనాలు మొలకెత్తే విధంగా ఉండాలని, తక్షణం అన్ని చర్యలు తీసుకొని విత్తనాలు నాటాలని సూచించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల్లో శానిటేషన్ పనులు జరగాలని ఎక్కడా అపరిశుభ్ర వాతావరణ ఉండకూడదని చెప్పారు. ఉదయం 6 గంటల వరకు ఇంటింటికి చెత్త సేకరణ జరగాలని, డ్రెయినేజీలో పూడికలు తీయించుట, పిచ్చి చెట్ల తొలగింపు, బ్లీచింగ్ చల్లటం, ప్రతి మంగళవారం, శుక్రవారంలో డ్రైడే, ఫ్రైడే కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు శానిటేషన్‌పై గురించి అవగాహన కల్పించాలన్నారు.

ఈ కార్యక్రమంలో 4 ఇంక్లైన్ సర్పంచ్ కాశీ విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శులు చెన్నకేశవ్, మదార్ భాష, ఈజీఎస్ సిబ్బంది నాగరాజు, కేస్లీ పాల్గొన్నారు.

హైపవర్ వేతనాలు అమలు చేయండి



సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ శుక్రవారం సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్‌కు సీఐటీయూ నాయకులు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సింగరేణి 135 సంవత్సరాల చరిత్రలో ఇంత వరకు ఏ సీఎండీ కూడా కాంట్రాక్ట్ కార్మికుల వినతిపత్రాలు తీసుకోలేదని, వారి సమస్యలు విన్న లేదని, మొదటిసారిగా మీరు స్పందించిన తీరును అభినందిస్తున్నట్లు చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బి.మధు మాట్లాడుతూ.. కోలిండియాలో జేబీసీసీఐలో చేసిన అగ్రిమెంట్ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలను అమలు చేయాలని, లేదా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. అదేవిధంగా సెప్టెంబర్ 22 నుంచి 18 రోజులు సమ్మె చేసిన సందర్భంగా చేసిన అగ్రిమెంట్‌లోని మిగిలిన అంశాలు బోనస్ 20 శాతం చెల్లించటం, నర్సరీ కార్మికులకు అగ్రికల్చర్ జీఓ ప్రకారం వేతనాలు, బోనస్ చెల్లించటం, చట్టప్రకారంగా రావాల్సిన పండుగ, ఆర్జిత సెలవులు ఇప్పించాలని, పెండింగ్ సమస్యలను పరిష్కారించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన సీఎండీ సమస్యలను వీలైనంత త్వరలో పరిష్కరిస్తామని, అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికులకు ఇన్సూరెన్స్ విషయం కూడా త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నర్సరీ, ఎస్అండ్‌పీసీ, బెల్ట్ క్లీనింగ్, సెల్ పీకింగ్, రోడ్డు క్లీనింగ్, హౌస్ పీకింగ్, సివిక్ ఇతర విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో సీఎం దృష్టికి..

కాంట్రాక్ట్ కార్మికులు తమ వేతనాల పెంపునకై శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణికి వెళ్లి సమస్యలను సీఎంకు విన్నవించారు. సుమారు 4 గంటల పాటు లైన్‌లో నిలపడి తమకు జరుగుతున్న శ్రమదోపిడీని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించేందుకు కలిసి కట్టుగా, మహిళా కార్మికులు సైతం వెళ్లారు.

ప్రారంభానికి నోచుకోని జీపీ భవనం



నిర్మాణం పూర్తయినా ప్రారంభించని నాయకులగూడెం పంచాయతీ కార్యాలయం

సుజాతనగర్: మండలంలోని నాయకులగూడెం గ్రామంలో ఐటీడీఏ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం రూ.20 లక్షలు వెచ్చించి కొత్త భవనాన్ని కట్టించి నెలలు గడుస్తున్నా.. పాత భవనం నుంచి కొత్త భవనంలోకి గ్రామ పంచాయతీ భవనం మారకపోవడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. మండలంలోని జామ్లాతండా, బేతంపూడి, కోయగూడెం, పాత అంజనాపురం, కొత్త అంజనాపురం, మాల బంజర, 2 ఇంక్‌లైన్, కోమటిపల్లి, నాయకులగూడెం, నిమ్మలగూడెం, సీతంపేట 11 గ్రామాలకు కొత్త భవనాలు మంజూరయ్యాయి.

వీటిలో కొన్ని భవనాలకు ఈజీఎస్, మరికొన్ని భవనాలకు ఐటీడీఏ నుంచి నిధులు మంజూరయ్యాయి. ఆయా గ్రామాల్లోని భవనాలు ఇంకా నిర్మాణాల్లో ఉన్నప్పటికీ నాయకులగూడెంలో మాత్రం భవనం పూర్తయి ఐదు నెలలు గడుస్తోంది. కొత్త భవనంలో పంచాయతీ కార్యదర్శికి ఒక గది, సర్పంచ్‌కు ఒక గది, సమావేశాల కోసం రెండు హాళ్లు, వాషింగ్ రూం ఇలా సర్వాంగ సుందరంగా భవనాన్ని నిర్మించారు. కొత్త భవనాలు నిర్మించుకునేందుకు నిధులు లేక ఎదురుచూపులు చూస్తుంటే ఈ గ్రామంలో తయారైన భవనాన్ని ఎందుకు ప్రారంభించడం లేదని పాలకవర్గాన్ని, అధికారులను స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా పాలకవర్గం చొరవ తీసుకొని కొత్త భవనాన్ని అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.